
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం : 31 : జూలై : 2023



ఆయకట్టు.. ఆయువుపట్టు !
నాగార్జున సాగర్ జలాలతో జిల్లాలో 17 మండలాల్లో పంటలు సాగవుతున్నాయి. రైతులకు సాగర్ వరంలా మారింది. 8లో



11న 'భారజల' ఎన్నికలు?
మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు వచ్చే నెల 11న నిర్వహించనున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 25°
వాతావరణం
జిల్లాలో సోమవారం పొడి వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన


శ్రీ సీతారామ చంద్రస్వామివారు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చనలను జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం స్వామివారిని తీన్మార్ మల్లన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. కేశవాపురం గ్రామస్తులకు తల్లికి బోనాలు సమర్పించారు. అనంతరం అర్చకులు అభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, ఎస్వీఆర్‌కే ఆచార్యులు, కిలారు నాగేమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి
జెడ్పీ సీఈఓ విద్యాలత


మణుగూరు రూరల్: అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

మణుగూరు రూరల్/పినపాక: వరద బాధితుల పునరావాస కేంద్రాల్లో బాధితులకు అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. ఆదివారం ఆమె మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పినపాక మండలం బయ్యారం క్రాస్ రోడ్‌లోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. బాధితులతో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. గోదావరి వరద ఉధృతి పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు బాధితులు ఇళ్లకు వెళ్లొద్దని సూచించారు. తహసీల్దార్లు కె.నాగరాజు, దుర్గాప్రసాద్, ఎంపీడీఓలు చంద్రమౌళి, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అలీం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బ్రహ్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు సింగరేణి జట్టు


సింగరేణి క్రికెట్ జట్టు సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): ఎస్‌ఎండీసీ క్రికెట్ టోర్నీలో సింగరేణి జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థల జట్లు తలపడుతున్న ఈ టోర్నీలో ఆదివారం హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) జట్టుపై సింగరేణి జట్టు విజయం సాధించింది. ఈ నెల 6న బెల్ జట్టుతో ఫైనల్ మ్యాచ్‌లో తలపడనుంది. హైదరాబాద్‌లోని విజయ్ ఆనంద్ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జట్టు సభ్యులను సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్, డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ తదితరులు అభినందించారు.

నెమ్మదించిన నది


భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి

ఎగువ నుంచి తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం

- రాత్రి 11 గంటలకు 48.9 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం
- పునరావాస శిబిరాల్లోనే ముంపు ప్రాంత ప్రజలు

భద్రాచలం: భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన గోదావరి ఆదివారం తగ్గుముఖం పట్టింది. శనివారం నీటిమట్టం 56 అడుగులు నమోదు కాగా, ఆదివారం తెల్లవారుజామున నుంచి వరద తగ్గుతోంది. తొలుత నెమ్మదిగా.. ఆ తర్వాత వేగంగా తగ్గటం మొదలయింది. తెల్లవారుజామున 2గంటలకు 56 అడుగులుగా ఉన్న గోదావరి 6 గంటలకు 55.40, 10 గంటలకు 54.30, మధ్యాహ్నం 12 గంటలకు 52.60 అడుగులు నమోదైంది. దీంతో మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. 4 గంటలకు 51.90 అడుగులతో 13,66,298 క్యూసెక్కుల నీరు, రాత్రి 10గంటలకు 49.3 అడుగులు, రాత్రి 11 గంటలకు 48.9 అడుగులుగా నమోదుకాగా 11,87,961 క్యూసెక్కుల నీటితో గోదావరి ప్రవహిస్తోంది.

ఇంకా తగ్గవచ్చు..
గోదావరికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సైతం తగ్గాయి. శ్రీరామ్ సాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి ప్రవాహం తక్కువగా ఉంది. తుపాకులగూడెంలోని సమ్మక్క సారక్క బ్యారేజి నుంచి 9 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చర్లలోని తాలిపేరు, కిన్నెరసాని, గోదావరికి దిగువన శబరి ఉప నదులు ప్రశాంతంగా ఉన్నాయి. దీంతో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి వరద సోమవారం సైతం తగ్గే అవకాశాలు ఉన్నట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాల నడుమ ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు తగ్గటంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

ఎటువంటి ఇబ్బందులు లేకపోతేనే ముంపు బాధితులు ఇళ్లకు..
రెండో ప్రమాద హెచ్చరికకు దిగువగానే గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు, అశ్వాపురం తదితర మండలాల్లో ముందస్తుగా తరలించిన నిర్వాసితులు పునరావాస శిబిరాల్లోనే ఉన్నారు. భద్రాచలంలోని సుభాష్ నగర్ కాలనీలో కొందరు తమ సామగ్రిని తిరిగి ఇళ్లకు చేర్చుకున్నారు. భద్రాచలం మండలంలో 4 శిబిరాల్లో 621 కుటుంబాలకు చెందిన 1,866 మంది, దుమ్ముగూడెం మండలంలో ఒక పునరావాస శిబిరంలో 200 మంది, చర్ల మండలంలో 653 కుటుంబాలకు చెందిన 2,734 మంది 12 పునరావాస శిబిరాల్లోనే కొనసాగుతున్నారు. మొదటి ప్రమాద హెచ్చరికస్థాయి 43 అడుగులకు కంటే


భద్రాచలంలోని సుభాష్ నగర్ కాలనీలో ఇళ్లకు చేరుస్తున్న సామాన్లు

ఇక పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


వరద తగ్గాక బురదమయంగా ఉన్న కూనవరం రోడ్డు

గోదావరి తగ్గుముఖం పడుతుండటంతో వరదకు కొట్టుకొచ్చిన బురదతో ముంపు గ్రామాలు, కాలనీలు అస్తవ్యస్తంగా ఉంటాయి. గోదావరికి తోడు భారీ వర్షాలు కురవడంతో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దీంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో సహజంగానే వర్షాకాలం సీజన్‌లో జ్వరాలు, అంటు వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. దీనికి వరద బురద తోడవ్వడంతో ఇంకా త్వరగా ప్రబలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో బ్లీచింగ్, క్లోరినేషన్, జిల్లా వైద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా అధికంగా పునరావాస శిబిరాలను ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. నిర్వాసితులు ఇళ్లకు వెళ్లాక ఆయా పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తిరిగి యథాస్థితికి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గోదావరి నీటి మట్టం తగ్గి, ముంపు గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుంటే.. అప్పుడు బాధితులను ఇళ్లకు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా భద్రాచలంలోని పునరావాస శిబిరాల్లో నిర్వాసితులకు అందుతున్న సౌకర్యాలను అడిషనల్ కలెక్టర్ రాంబాబు ఆదివారం పర్యవేక్షించారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, బీజేపీ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి వేర్వేరుగా భద్రాచలంలోని ముంపు కాలనీలు, పునరావాస శిబిరాలను సందర్శించి, నిర్వాసితులను పరామర్శించారు.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద

పాల్వంచరూరల్: ఎగువ నుంచి కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, ఆదివారం 402.2 అడుగులుగా నమోదైంది. జలాశయంలోకి 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని ప్రాజెక్ట్ ఈఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. వరద ఉధృతి పెరిగితే గేట్లు ఎత్తి, దిగువకు నీటి విడుదల చేస్తామని పేర్కొన్నారు.

వరద వెతలు తొలగాలంటే..


యటపాక వద్ద రోడ్డుపై వరద నీరు చేరడంతో దుమ్ముగూడెం వెళ్లకుండా ఆగిపోయిన మంత్రి అజయ్

హైలెవల్ వంతెనలు నిర్మిస్తే సరి

- గోదావరి ఉధృతికి రోడ్లపైకి చేరుతున్న వరద నీరు
- ఏజెన్సీలో రాకపోకలు బంద్.. నిత్యావసరాలకు కటకట
- గతేడాది హెలికాప్టర్ల ద్వారా ఆహార పొట్లాల పంపిణీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : గోదావరికి వరదలు వస్తే తీరం వెంబడి ఉన్న ఏజెన్సీ ప్రాంతాల ప్రజల కష్టాలు చెప్పనలవి కాదు. భద్రాచలం వద్ద నీటిమట్టం 53 అడుగులకు చేరితే ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మధ్య ఉన్న రహదారులపైకి వరద నీరు ముంచెత్తుతుంది. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.

భద్రాచలం–చర్ల–వెంకటాపురం రహదారిపైకి వరద
అభివృద్ధి అంటే ఏజెన్సీ ప్రజలకు పెద్దగా పరిచయం లేని కాలంలో వరదలు వస్తే అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ తమకు తోచిన తీరులో జాగ్రత్తలు తీసుకునేవారు. కానీ ఇంటర్నెట్ యుగంలో మొబిలిటీ విపరీతంగా పెరిగిపోయిన రోజుల్లో కూడా వరద వస్తే కాలుబయట పెట్టలేని దుస్థితిలోనే ఉండాల్సి వస్తోంది. ఎక్కడో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో వానలు కురిస్తే ఇక్కడ గోదావరి ఉప్పొంగుతుంది. భద్రాచలం–చర్ల–వెంకటాపురం (కే)లను కలిపే రహదారిపైకి గోదావరి వరద నీరు చేరుకుంటుంది. దీంతో యటపాక (ఏపీ), తూరుబాక, కలివేరు, చర్ల, సుబ్బంపేటల దగ్గర నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతుంది. ఫలితంగా ఈ దారిలో రాకపోకలు నిలిచిపోతాయి.

వంతెనలు నిర్మిస్తే సమస్యకు చెక్
వానాకాలం వస్తే ఎప్పుడు గోదావరి పోటెత్తుందో తెలియక అక్కడి జనం అల్లాడిపోతారు. చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల వ్యాపారులు మూడు నెలలకు సరిపడా వస్తువులు కొని పెట్టి ఉంచుకుంటారు. ప్రభుత్వం సైతం సంక్షేమ హాస్టళ్లు, రేషన్ డీలర్లకు ముందుగానే బఫర్ స్టాక్‌ను సరఫరా చేస్తుంది. దీనికి తోడు వరదల సమయంలో పునరావాస కేంద్రాల కోసం పప్పులు, నూనెలు, కూరగాయలు, గ్యాస్ తదితర వస్తువులను అధికంగా నిల్వ చేస్తుంది. గతేడాది అంచనాకు మించి వరద రావడంతో ముందుగా సిద్ధం చేసిన స్టాక్ సరిపోలేదు. దీంతో ఓ వైపు నిత్యావసర వస్తువులను మరోవైపు ఆహార పొట్లాలను ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా జారవిడవాల్సి వచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం హెలికాప్టర్లలోనే వెళ్లాల్సి వచ్చింది. భద్రాచలం-వెంకటాపురం మండలాలను కలిపే రహదారిలో లోతట్టు ప్రాంతాల్లో దగ్గర నాలుగైదు వంతెనలు నిర్మిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కానీ ఈ దిశగా ఇప్పటివరకు అడుగులు పడిన దాఖలాలు లేవు. ఎప్పుడు వరద వచ్చినా సమీక్షలు నిర్వహించడం, అందులో దారులు మూసుకుపోతే పునరావాస కేంద్రాలు, బఫర్ స్టాక్ గురించే చర్చ జరుగుతూ వస్తోంది. ఈ దిశగా ఆర్‌అండ్‌బీ నుంచి కూడా ప్రత్యేక ప్రణాళికలు ఏమీ సిద్ధం చేయడం లేదు.

కీలక మార్గం
విజయవాడ–జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) జాతీయ రహదారి 222 జిల్లాలో కొత్తగూడెం–పాల్వంచ–భద్రాచలం మీదుగా చింతూరు వైపు వెళ్తుంది. మరోవైపు హైదరాబాద్- భూపాలపట్నం (ఛత్తీస్‌గఢ్) జాతీయ రహదారి 163 హైదరాబాద్–వరంగల్ -ములుగు- వాజేడు మీదుగా వెళ్తుంది. ఈ రహదారులను భద్రాచలం–వాజేడు మార్గం కలుపుతోంది. 110 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ మార్గం ప్రస్తుతం రహదారులు, భవనాల శాఖ ఆధీనంలో ఉంది. పైగా ఇది నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల గుండా వెళ్తోంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం పుష్కలంగా నిధులు మంజూరు చేస్తోంది. ఆర్‌అండ్‌బీ నుంచి ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం, లోతట్టు ప్రాంతాల్లో హై లెవల్ వంతెనలు నిర్మించడం ఇప్పుడే సాధ్యపడని పక్షంలో కనీసం కేంద్రంతో సంప్రదింపులు జరిపయినా ఇక్కడి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఎంపీ కవిత దృష్టి సారిస్తే..



గౌరెల్లి నుంచి కొత్తగూడెం వరకు నిర్మిస్తున్న కొత్త జాతీయ రహదారి 930(పీ)ని సాధించడంలో మహబూబాబాద్ ఎంపీ కవిత ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం ఈ మార్గం నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణ పనులు జరుగుతున్నాయి. ఇదేతీరుగా ఎన్‌హెచ్ 222, ఎన్‌హెచ్ 163లను కలిపే వాజేడు–భద్రాచలం మార్గానికి కూడా జాతీయ రహదారి హోదా కల్పిస్తే కేంద్రం నుంచి నిధులు వచ్చేందుకు ఆస్కారం ఉంది. పైగా ఇటు భద్రాచలం, అటు ములుగు రెండు నియోజకవర్గాలు ఎంపీ కవిత పరిధిలోనే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలను కలిపే ఈ దారిపై దృష్టి సారిస్తే వానాకాలంలో ఏజెన్సీ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

పండ్ల తోటలతో ఆదాయం

- రాయితీలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
- జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న

దుమ్ముగూడెం: పండ్ల తోటల సాగుతో నికర ఆదాయం లభిస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ, హార్టికల్చర్ శాఖ ద్వారా తోటల పెంపకాన్ని ప్రభుత్వ ప్రోత్సహిస్తోందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దార్లగూడెం గ్రామంలో కొర్సా గంగరాజు డ్రాగన్ తోటను ఆయన సందర్శించారు. మొక్కలను పరిశీలించి పలు సూచలను చేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరేడు, సీతాఫలం, సపోట, పనస వంటి డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, పండ్ల తోటల్లో అంతర పంటలుగా ఆకు కూరలు, కాయగూరలు కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. 2023–24 సంవత్సరంలో 3,300 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు, అనువైన భూమి, నీటి సౌకర్యం ఉంటే, 5 ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై మొక్కలు, బిందు సేద్య పరికరాలు అందిస్తామని వివరించారు. వివరాలకు పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, ఏపీఓ, వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, మండల వ్యవసాయాధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి తదితరులను సంప్రదించాలని కోరారు. రాయితీ పొందేందుకు నేటితో దరఖాస్తు గడువు ముగియనుందని తెలిపారు.


డ్రాగన్ తోటను పరిశీలిస్తున్న మరియన్న తదితరులు

వరద బాధితులను ఆదుకోవాలి

బీజేపీ జాతీయ నాయకుడు సుధాకర్‌రెడ్డి

బూర్గంపాడు: గోదావరి వరద బాధితులకు ప్రభుత్వం తక్షణసాయం అందించాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు రాష్ట్ర ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ నాయకులు బూర్గంపాడు వద్ద గోదావరి వరద ఉధృతిని, వరదలకు దెబ్బతిన్న రహదారులను, పంటచేలను పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ముంపు బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది వరదల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను ఇంతవరకు హామీలు చేయలేదని విమర్శించారు. వరద చేరిన ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు ఆర్థికసాయంతోపాటు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరద ముంపు బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సర్వే చేపట్టి పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. మాజీ ఎంపీ రవీంద్రనాయక్, నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు, కె.రాములు, కుంజా సత్యావతి, ఏనుగుల వెంకటరెడ్డి, భూక్యా సీతారాంనాయక్, భూక్యా దివ్యశ్రీ, బిజ్జం శ్రీనివాసరెడ్డి, బీరక సాయిశ్రీను తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ తప్పిదంతోనే ముంపు
భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ తప్పిదంతోనే భద్రాద్రి వాసులు ప్రతి ఏటా గోదావరి ముంపు బాధలు పడుతున్నారని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ముంపు పునరావాస కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించి మాటఆలడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కిరణ్, రాజు బెహరా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలకు తక్షణమే మరమ్మతులు

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- ముంపు బాధితుల ఇళ్లు, దెబ్బతిన్న బ్రిడ్జిల పరిశీలన

గుండాల: వర్షాలు, వరదలతో దెబ్బతిన్న బ్రిడ్జిలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. ఆదివారం ఆమె మండలంలోని ముంపు గ్రామాలను సందర్శించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం కోతకు గురైన బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోదుగులగూడెం వద్ద కిన్నెరసాని బ్రిడ్జి, సాయనపల్లి వెళ్లే మార్గంలో మల్లన్న వాగు బ్రిడ్జిలకు మరమ్మతులు నిర్వహించాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ముత్తాపురం, సాయనపల్లి, నర్సాపురం గ్రామాల్లో మండలాధికారులు తగిన చర్యలు చేపట్టాలని, అంతర్గత రోడ్లు శుభ్రం చేయాలని, చెత్తాచెదారం తొలగించాలని చెప్పారు. బాధితులు అధైర్య పడవద్దని, ఇక్కడి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. మండల కేంద్రాలకు రాలేని గ్రామాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలితే అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే చేపట్టాలని తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లతోపాటు జరిగిన నష్టాలపై నివేదికలు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, ఆర్డీఓ శిరీష, డీపీఓ రమాకాంత్, డీఎంహెచ్ఓ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబు, జెడ్పీటీసీ రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వలీ, సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్, భీమ్లా, మోతీలాల్ పాల్గొన్నారు.



వరదకు దెబ్బతిన్న కిన్నెరసాని బ్రిడ్జిని, ముంపునకు గురైన ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

ఓపెన్‌కాస్టు గనుల్లో నీటిని తోడిపోయాలి

మణుగూరు రూరల్: ఓసీ క్వారీలో చేరిన వర్షపు నీటిని ఎత్తిపోయాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మణుగూరు ఏరియా పరిధిలోని పీకేఓసీ-2, ఓసీ-4 గనులను వ్యూపాయింట్ల నుంచి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలతో ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. క్వారీలోని భారీ వాహనాలను పైకి తీసుకొచ్చి, హాల్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. బీటీపీఎస్‌కు నిరంతరం బొగ్గు సరఫరా అధికారులకు సూచించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు టి.లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం నుంచి పోటీ చేస్తా

హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు

కొత్తగూడెం రూరల్: సీఎం కేసీఆర్ ఆదేశిస్తే కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ముషీరాబాద్ నుంచి పోటీ చేస్తానంటూ వచ్చిన కథనాలలో వాస్తవం లేదన్నారు. తాను పుట్టిన ప్రాంతం, తన జన్మభూమి, కర్మభూమి కొత్తగూడెమేనని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం మాత్రమే జనరల్ స్థానాలని, కొత్తగూడెం నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు 85 శాతం మంది ఉన్నారని అన్నారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఓసీలే ఎక్కువగా పోటీలో ఉంటారని, కొత్తగూడెం నుంచి బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఆగస్టు ఐదు నుంచి 'గడ పగడపకూ జీఎస్సార్'కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో జీఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్సార్ ట్రస్ట్ బాధ్యులు కనకేష్, ప్రభాకర్, జోగారావు, అంజి, ఉజ్జీవరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు

క్లుప్తంగా

వరద తగ్గే వరకూ శిబిరాల్లోనే..


నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలం: గోదావరి వరద పూర్తిగా తగ్గి..సాధారణ స్థితికి వచ్చే వరకూ ముంపు ప్రాంత ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లోనే ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. ఆదివారం రాత్రి అభ్యుదయ భవన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్వాసితులతో మాట్లాడాక శిబిరంలో ఉన్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతుందని, అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రాల్లో నిరంతరాయ పారిశుద్ధ్య పనులను చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు.

అవెన్యూ ప్లాంటేషన్లను అభివృద్ధి చేయాలి

డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు


నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

బూర్గంపాడు: అన్ని గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్లను అభివృద్ధి చేయాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు సూచించారు. ఆదివారం ముసలిమడుగు గ్రామపంచాయతీలోని హరితహారం నర్సరీని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున ఇవ్వాలని, నర్సరీలలో ఎత్తైనా మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్‌కు వినియోగించాలని సూచించారు. మొక్కల పంపిణీ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

కొత్తగూడెం వాసికి కాంస్య పతకం


పతకం అందుకుంటున్న ధనుష్

కొత్తగూడెంటౌన్: తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కొత్తగూడెం త్రీఇంక్‌లైన్‌కు చెందిన రెడ్డిరాజుల ధనుష్ కాంస్య పతకం సాధించాడు. బేగంపేటలోని పబ్లిక్‌స్కూల్‌లో రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ ఈత పోటీల్లో పాల్గొని 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో పతకం సాధించినట్లు కోచ్ సామ్యూల్ తెలిపారు. ఈమేరకు ధనుష్‌ను కొత్తగూడెం సీఈఆర్ క్లబ్ కోచ్‌లు సామ్యూల్, హనుమంతరాజు, సంధ్య తదితరులు అభినందించారు.

దొరల చేతుల్లో రాష్ట్ర పాలన

పాల్వంచ: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలం చెందిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మంచికంటినగర్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు బీఎస్పీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రపాలనంతా ఒక శాతం ఉన్న వెలమ దొరల పాలనలో చిక్కుకుందని, 50 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, బీసీలకు మంత్రి పదవుల్లో తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొళ్ళపూడి ప్రవీణ్‌కుమార్, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు కేతిని కుమారి, కాటబోయిన వసుంధర, కంపాటి బాబు, చందర్ రావు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా..

చర్ల: భద్రాచలం నుంచి చర్ల మండలానికి రోడ్డు రవాణా కలిగి ఉండి హెలికాప్టర్ ద్వారా పాలు, నీళ్ల పంపిణీ చేస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని జనం విమర్శలు గుప్పిస్తున్నారు. భద్రాచలం నుంచి మారాయిగూడెం మీదుగా రోడ్డు సౌకర్యం ఉండడంతో హెలికాప్టర్‌లో తీసుకొచ్చిన 432 పాల ప్యాకెట్లు, 432 వాటర్ బాటిళ్లను ఏదో ఒక వాహనంలో తీసుకొచ్చి ఉంటే రూ. 10వేలకు మించి ఖర్చు అయి ఉండేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ భద్రాచలం – చర్ల వాయుమార్గంలో 50 కిలోమీటర్ల మధ్య రెండు సార్లు (మొత్తం 200 కి.మీ.) హెలికాప్టర్ ద్వారా తీసుకొచ్చిన పాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ల ఖరీదు సుమారు రూ.35 వేలు మాత్రమే ఉండగా వాటిని హెలికాప్టర్ ద్వారా పంపించడానికి ఎంత ఖర్చు అయ్యి ఉంటుందనేది అధికారులకే తెలియాలంటున్నారు. అయినా చర్ల మండలంలోని అన్నీ ముంపు ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు అందుబాటులో మిషన్ భగీరథ నీళ్లు, అన్నీ ప్రధాన వ్యాపార సముదాయాలలో పాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నా.. ఇలా రూ.లక్షలు వృథా చేసి హెలికాప్టర్‌ను తిప్పడంపై జనం విమర్శిస్తున్నారు. విపత్తుల సందర్భాల్లో ప్రజానీకానికి సహాయ సహకారాలు అందించాలి గానీ ఇలా వృథా చేయడం కాదని జనం చర్చించుకుంటున్నారు.

ఆయకట్టు.. ఆయువుపట్టు!


సాగర్ ఔట్ ఫాల్ కెనాల్, (ఇన్‌సెట్) సాగర్ ఇన్‌ఫాల్ కెనాల్

జిల్లా రైతులకు వరంలా 'సాగర్'

- ప్రాజెక్టు రెండో జోన్ కింద పంటల సాగు
- 17 మండలాల్లో 2.80 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు
- తరతరాలుగా పండించుకుంటున్న అన్నదాతలు

ఓ గ్రామానికి చెరువు.. కాస్త పెద్ద పట్టణమైతే మరింత పెద్ద చెరువు.. లేదంటే జలాశయం, రిజర్వాయర్! ఇవీ సాగు, తాగునీటి అవసరాల కోసం పూర్వీకులు, రాజుల కాలంలో నిర్మించి ఉంటారు. అయితే, జిల్లాలో 17 మండలాల రైతుల భూములను నాగార్జునసాగర్ జలాలు తడుపుతున్నాయి. జిల్లాలో 21 మండలాలు ఉండగా.. 17 మండలాల ఆయకట్టు సాగర్ జలాలతోనే సాగవుతోందంటే ఎంత కీలక పాత్రో అర్థం చేసుకోవచ్చు. యాభై ఏళ్ల క్రితం సాగర్ కాల్వలు అందుబాటులోకి రాగా.. ఇప్పుడు చాలా కుటుంబాల్లో మూడో తరం ఈ జలాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తోంది. ఇంతలా లక్షలాది రైతుల కుటుంబాల జీవనంలో పెనవేసుకుపోయిన నాగార్జున సాగర్ కాల్వల పరిస్థితి, ఆయకట్టు, ఇతర అంశాలపై వివరాలను ఓసారి పరిశీలిద్దాం !

– ఖమ్మం డెస్క్

మొదటి జోన్ ముగింపు.. రెండో జోన్ ఆరంభం

కృష్ణా జలాల ఆధారంగా ఉమ్మడి ఏపీలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ ప్రాజెక్టును నిర్మించారు. ఇందులో మొదటి జోన్ సూర్యాపేట మీదుగా ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించి ముగుస్తుంది. ఆ తర్వాత మొదలయ్యే రెండో జోన్‌లో జిల్లాలోని 17 మండలాల్లో ఆయకట్టుతో పాటు ఏపీలోని పలు ప్రాంతాలకు సాగు నీరు అందుతోంది.

రంగుల బ్రిడ్జి వద్ద ప్రవేశం

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని రంగుల బ్రిడ్జి నుంచి నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారా జిల్లాలోకి సాగర్ జలాలు ప్రవేశిస్తాయి. ఇక్కడి నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద ఉన్న ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ నుంచి సాగర్ జలాలు పాలేరు రిజర్వాయర్‌లో కలుస్తాయి. ఇలా నాయకన్‌గూడెం వద్దకు ఉన్న కాల్వ మొదటి జోన్ పరిధిలోకి వస్తుంది. ఇక రిజర్వాయర్ నుంచి పాలేరు వద్ద ఔట్ ఫాల్ కెనాల్ ప్రారంభం అవుతుండగా ఇక్కడి నుండే రెండో జోన్ మొదలవుతుంది. కాగా, ఈ రెండో జోన్‌లోని ఎడమ కాల్వ ద్వారానే ఖమ్మం జిల్లాలోని 17 మండలాలతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లాలో కూడా లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందుతోంది.


సాగర్ కింద సాగు చేస్తున్న వరి పొలం

80 కిలోమీటర్లు..

సాగర్ ఎడమ కాల్వ జిల్లాలోని 17 మండలాల్లో 80 కిలోమీటర్ల మేర సాగుతుంది. దీని ఆయకట్టు పరిధిలో 2.80 లక్షల ఎకరాల్లో వరి, మరో 3 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతాయి. ఇక ప్రధాన కాల్వకు అనుసంధానంగా 119 మేజర్లు, 3090 మైనర్లు, సబ్‌మైనర్లు, 223 బ్రాంచ్ కెనాళ్లు ఉండడం విశేషం. తద్వారా ప్రధాన కాల్వ వెంట ఉన్న ఆయకట్టుతో పాటు మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు, ఇతర కాల్వల కింద కూడా రైతులు నిశ్చింతగా పంటలు సాగు చేసుకుంటున్నారు.

ఎడమ కాల్వ నిడివి	: 80 కి.మీ.
ఆయకట్టు (వరి)	: 2.80 లక్షల ఎకరాలు
ఆరు తడి పంటలు	: 3 లక్షల ఎకరాలు
మేజర్ కాల్వలు	: 119
నిడివి	: 1,200 కి.మీ.కు పైగా
మైనర్లు, సబ్ మైనర్లు	: 3,090
నిడివి	: 7,500 కి.మీకు పైగా
బ్రాంచ్ కెనాళ్లు	: 223
బోనకల్ బ్రాంచ్ కెనాల్	: 50 కి.మీ.
మధిర బ్రాంచ్ కెనాల్	: 55 కి.మీ.

పాత కాల్వకు కూడా...

రిజర్వాయర్ కంటే పూర్వం పాలేరు చెరువు ఉండేది. దీనికి అనుబంధంగా పాలేరు కాల్వ(పాత కాల్వ) సైతం ఉంది. ఈ మేరకు ఈ కాల్వకు కూడా సాగర్ జలాలను అందిస్తుంటారు. కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో పారే ఈ కాల్వ పరిధిలో సుమారు 28వేల ఎకరాల్లో వరి, చెరకు పంటలు సాగవుతున్నాయి. ఇక ఎన్నెస్పీ కాల్వల ద్వారా వైరా రిజర్వాయర్‌కు, బ్రాంచ్, సబ్ కెనాళ్ల నుంచి గ్రామాల్లోని చెరువులకు వర్షాభావ పరిస్థితుల్లో నీరు అందిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. కాగా, పాలేరు ఎడమ కాల్వ పరిధిలో రైతులు సాగర్ జలాలు వచ్చినా, రాకున్నా నీటి చెమ్మ ఆధారంగానే కాక బావులు, బోర్ల ద్వారా పంటలు సాగు చేస్తుంటారు. దాదాపు ఏడాదంతా కాల్వలో నీరు పారుతుండడంతో పాటు భూగర్భ జలాలు మెరుగైన స్థితిలో ఉండడమే ఇందుకు కారణం. జిల్లాలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే సాగర్ ఆయకట్టు రైతులు ఏటా సీజన్‌లో త్వరగా పంటల సాగు ప్రారంభించి త్వరగా ముగిస్తారు. తద్వారా ఇక్కడ వరి మిగతా ప్రాంతాలతో పోలిస్తే ముందుగానే చేతికొస్తుంది.

ఐదెకరాల్లో రెండు పంటలు



నాకు సాగర్ కాల్వ కింద ఐదెకరాల భూమి ఉంది. ఏటా సాగర్ జలాలతోనే వరి రెండు పంటలు పండిస్తున్నా. మా తాతల కాలం నాటి నుండి ఈ కాల్వ నీళ్లే పంటల సాగుకు ఆధారం. మా ప్రాంతంలో సాగర్ కాల్వ ఉండడాన్ని అదృష్టంగా భావిస్తాం.

– బీరెల్లి సుధాకర్‌రెడ్డి, మల్లాయిగూడెం, కూసుమంచి మండలం

సాగరే మా జీవనాధారం



సాగర్ నీటి సరఫరా ద్వారా 4 ఎకరాలు సాగు చేసుకుంటున్నాం. అందులో రెండు ఎకరాలు వరి, రెండు ఎకరాల చెరకు ఉంది. ఏటా రెండు పంటలు సాగవుతాయి. సాగర్ కాల్వ మొదలైనప్పటి నుంచి ఈ నీరే మా జీవనాధారంగా మారింది.

– రచ్చా నర్సింహారావు, చెన్నారం, నేలకొండపల్లి మండలం

వరదలకు శాశ్వత పరిష్కారం చూపాలి


నిర్వాసితులతో మాట్లాడుతున్న నాయకుడు వి.హనుమంతురావు

భద్రాచలం: భద్రాచలంలో ప్రతీ ఏడు సంభవిస్తూ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్న గోదావరి వరదలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కార మార్గం చూపాలని మాజీ ఎంపీ, మాజీ పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతురావు అన్నారు. ఆదివారం ఆయన డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి గోదావరి కరకట్ట, స్లూయిస్ లాకుల ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం గిరిజన అభ్యుదయ భవనంలో ఏర్పాటు చేసిన గోదావరి ముంపువాసుల పునరావాస కేంద్రాన్ని సందర్శించి నిర్వాసితులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం వరదలు సంభవించినప్పుడు మాత్రమే కంటి తుడుపు చర్యలను చేపడుతూ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. వందల కోట్ల రూపాయల హామీలతో ప్రజలను మభ్య పెడుతూ నిర్లక్ష్యపూరిత పాలనను సాగిస్తుందని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, వెంటనే శాశ్వత ప్రణాళికను అమలు పరుస్తామని తెలిపారు. ముంపు ప్రాంత వాసులు అందరికీ స్థలాలను కేటాయించి ఇల్లు నిర్మాణానికై చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. వీరితో పాటు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ కొత్త సీతారాములు, భద్రాచలం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరేళ్ళ నరేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిరియాల రవికుమార్, నాయకులు అడబాల వెంకటేశ్వర్లు, బలుసు సతీష్, సరెళ్ల వెంకటేష్, దేవకీ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులంటే బానిసలు కాదు..

- సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి
- కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభలో వక్తలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం బానిసలుగా చూస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ఆరోపించారు. ఆదివారం కొత్తగూడెంలోని మంచికంటిభవన్‌లో నిర్వహించిన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఎస్‌సీకేఎస్) రాష్ట్ర ఆరో మహాసభలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల చూపిస్తున్న వివక్షతను ఐక్య ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కోల్ ఇండియాకు అనుబంధంగా ఉన్న సింగరేణి సంస్థ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై చేసిన వేతన ఒప్పందం అమలుకాక ఒక్కో కార్మికుడు నెలకు రూ.15,600 నష్టపోతున్నారని తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 8,9 తేదీల్లో మహాపడావు పేరిట అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, మధు, కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, సూరం అయిలయ్య, దూలం శ్రీను, డి.వీరన్న, భూక్య రమేష్, జి.శ్యామ్, భాస్కర్, ప్రభాకర్, గద్దల శ్రీను, సీనియర్ నాయకులు రాజారావు, వై.వీ., తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు న్యాయమైనవే..

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు న్యాయపరమైనవే. వాటి పరిష్కారం కోసం సీఐటీయూ అనేక పోరాటాలు చేసింది. సింగరేణి లాభాల సాధనలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమదాగి ఉందని, ఇటువంటి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ప్రభుత్వ పరంగా ఏదైనా సహాయం కావాలంటే సహకరిస్తా.

– కంచర్ల చంద్రశేఖర్, జెడ్పీవైస్ చైర్మన్

పోరాడితేనే హక్కుల సాధన..

కాంట్రాక్ట్ కార్మికుల హక్కులకోసం సీఐటీయూ అలుపెరుగని పోరాటాలు నిర్వహించడంతోనే ఇప్పుడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సౌకర్యాలు సాధ్యమయ్యాయి. కార్మికులు పోరాడితేనే హక్కులు సాధించగలం. మెరుగైన వేతనాలు, ఉద్యోగభద్రత కోసం చేస్తున్న ఈ మహాసభను విజయవంతం చేయాలి.

– అందెల ఆనందరావు, సింగరేణి రిటైర్డ్ జీఎం

వివాదాస్పదంగా భూ ఆక్రమణ

- స్వాధీనం కోసం అధికారుల యత్నం
- పట్టువీడబోమని ఆక్రమణదారుల ఆందోళన
- మద్దతు తెలిపిన జెడ్పీ చైర్మన్


పేదలతో మాట్లాడుతున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ సమీపంలోని ఖాళీ భూభాగం వివాదాస్పదంగా మారుతోంది. మూడు నెలల క్రితం ఖాళీగా ఉన్న స్థలంలో బాలాజీనగర్ గ్రామపంచాయతీకి చెందిన కొందరు పేదలు గుడిసెలు వేసుకొని ఆక్రమించుకున్నారు. నాటి నుంచి గుడిసెలు ఖాళీ చేయించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు పలురూపాల్లో ప్రయత్నిస్తున్నా ఫలితం లేకుండాపోయింది. ఈ విషయంలో అధికారులకు, ఆక్రమణదారులకు పలుమార్లు వాగ్వాదంచోటుచేసుకుంది. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రెవెన్యూ అధికారులు పేదలు ఆక్రమించుకున్న స్థలాన్ని ఎంపిక చేసి అందుకు అనుగుణంగా పంచనామా పత్రాన్ని గ్రామపంచాయతీకి అందజేశారు. కానీ ఆక్రమణదారులు అడ్డుగా ఉండటంతో ఆ స్థలంలోకి వెళ్లేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం సాహసించడంలేదు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఎంపీఓ సంయుక్తంగా రెండు రోజులుగా గుడిసెలు ఖాళీ చేయించే ప్రయత్నంలో భాగంగా ఆదివారం గుడిసెలు తొలగించాలని ఆదేశిస్తూ గ్రామపంచాయతీ వర్కర్లను పురమాయించారు. విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు అక్కడకు చేరుకొని పంచాయతీ సిబ్బందిని అడ్డుకున్నారు. ఇదే సమయాన జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అక్కడకు చేరుకొని పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు బాగు చేసుకున్న భూమిలో పంచాయతీ భవనం ఎలా నిర్మిస్తారని, దానికోసం వేరొక స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. చదును చేసుకున్న భూమిని కాపాడుకునేందుకు పేదలు చేస్తున్న పోరాటానికి తన మద్దతు ఉంటుందని వారికి తెలిపారు.

అవగాహన లేకనే అక్రమ రవాణాలు


చైల్డ్‌లైన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: అట్టడుగు వర్గాల వారికి అవగాహన లేకనే ఎక్కువగా అక్రమ రవాణాకు గురవుతున్నారని చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో చైల్డ్ లైన్ 1098 పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్రమ రవాణా లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, బానిసత్వం కోసం జరుగుతుందని, సామాజిక, ఆర్థిక అసమానతలతో పేదరికంలో జీవించే వారు, విద్య, ఆరోగ్యం బాగాలేని వారు, వివక్ష, హింసకు గురయ్యే వారు ఎక్కువ మంది బాధితులున్నారని తెలిపారు. కోవిడ్–19 మహమ్మారి అక్రమ రవాణా లక్షణాలను కూడా మార్చిందని, నేరం అధికారుల దృష్టికి వచ్చే అవకాశం తక్కువగా చేయడం వలన బాధితులకు ప్రమాదాలను పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 41 శాతం మంది బాధితులు మాత్రమే వారి కష్టాల నుంచి తప్పించుకోవడానికి వారి సొంత చొరవతో అధికారులను సంప్రదిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆర్‌పీఎఫ్ పోలీసులు, చైల్డ్‌లైన్ సిబ్బంది, రైల్వే ప్రొటెక్షన్ పోలీసు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద ఘర్షణ

అశ్వారావుపేటరూరల్: మద్యం దుకాణం వద్ద జరిగిన దాడి ఘటనలో ఓ వ్యక్తిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో గల మద్యం దుకాణం వద్ద శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బాలాజీ నాయుడుపై జెట్టి రామకృష్ణ రాయితో తలపై దాడి చేశాడు. దీంతో బాలాజీనాయుడుకి గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వరి నాట్లు వేస్తున్న చిన్నారులు

జోరు వర్షాలతో రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో గ్రామీణ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు పొలం బాట పట్టారు. అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం సమీపంలో ఓ రైతుకు చెందిన పొలంలో ముసురు కారణంగా కూలీల కొరత ఉండడంతో సదరు రైతు తన పిల్లలను సాయానికి పొలానికి తీసుకొచ్చాడు. ఆ చిన్నారులు పొలంలో నారు కట్టల్ని కూలీలకు అందిస్తూ, ఖాళీ సమయాన నాట్లు వేశారు. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– అశ్వారావుపేటరూరల్

అక్రమ మట్టి తోలకాలు..

రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ పట్టివేత..

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రెండు మట్టి ట్రాక్టర్లు, జేసీబీని ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పడమటనర్సాపురం, భేతాళపాడు గ్రామాల మధ్య అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌ఏ బహర్ అలీ దాడి చేశారు. దీంతో అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకుని స్థానిక తహసీల్‌కు తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ శారదను వివరణ కోరగా పట్టుబడిన వాహనాలకు జరిమానావిధించనున్నామని పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పినపాక: దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలస ఆదివాసీ గ్రామమైన విప్పలగుంపు గ్రామానికి చెందిన భీమయ్య ఇంటికి అదే గ్రామానికి చెందిన కుంజా గణేష్ అర్ధరాత్రి సమయాన వెళ్లాడు. ఇంటికి ఎందుకు వచ్చావని ప్రశ్నించిన భీమయ్యపై వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్ మీరాఖాన్ తెలిపారు.

పురుగుమందు తాగిన బాధితుడి భార్య..

వివాదం అనంతరం బాధితుడి భార్య కమల పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా వెంటనే గ్రామానికి చేరుకొని 108 వాహనంలో బాధితురాలిని మణుగూరు ప్రభుత్వ తరలించారు.

డీజిల్ దొంగతనం..

దుమ్ముగూడెం: డీజిల్ దొంగతనంపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివవరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాల్లో శనివారం రాత్రి కొందరు గుర్తుతెలియని దొంగలు లారీలు, జేసీబీ వాహనాల నుంచి వందల లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రం బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గౌతమిపురంకు చెందిన కృష్ణ(46) శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబసభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి..

9 ద్విచక్ర వాహనాలు, 1,800 నగదు స్వాధీనం

దుమ్ముగూడెం: మండల పరిధిలోని మారెడుబాక గ్రామంలో జరుగుతున్న కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ నర్సిరెడ్డి తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోగా మిగతా వారు పరారయ్యారు. ఈమేరకు వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలు, రూ.1,800 నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా...

అగ్నిగుండంలో దూకి.. వ్యక్తి ప్రాణాలు కాపాడి!

- అన్నమయ్య జిల్లాలో ఓ వలంటీర్ సాహసం


చికిత్స పొందుతున్న కల్లూరి బాషా


గాయాలపాలైన వలంటీర్ సురేష్

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని ఓ.కొత్తపల్లిలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయాడు. అక్కడే ఉన్న వలంటీర్ చాపల సురేష్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండంలో దిగి బాషా ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటనలో బాషా వీపు భాగం బాగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వలంటీర్ కాళ్లు కాలిపోవడంతో కోడూరులో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. పీర్లచావిడి అగ్నిగుండం వద్ద జరిగిన ఈ సంఘటనను వందలాది మంది చూస్తున్నారే తప్ప బాషా ప్రాణాలను కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు. కానీ వలంటీర్ సురేష్ సాహసం చేసి గుండంలో పడిపోయిన బాషా ప్రాణాలు కాపాడి అందరి మన్ననలు పొందాడు.

రొట్టె పట్టగా.. కోర్కె తీరగా..!

- కొనసాగుతున్న రొట్టెల పండగ




సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించే రొట్టెల పండగ ఆదివారం వేడుకగా కొనసాగింది. కోర్కెల రొట్టెలను పట్టుకునేందుకు లక్షలాదిగా రావడంతో రొట్టెలు మార్చుకునే భక్తులతో స్వర్ణాల చెరువు జనసంద్రమైంది. అక్కడ స్నానమాచరించి కోర్కెల రొట్టెలను పట్టుకున్నారు. అర్ధరాత్రి తర్వాత దర్గా ప్రాంగణంలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. రొట్టెల పండగకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చారు.

భూగోళం.. ఇక మండే అగ్నిగోళం

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసింది

- బాయిలింగ్ యుగం మొదలైంది.. ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- జూలైలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు
- 1.20 లక్షల సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- హీట్‌వేవ్‌ను ఎదుర్కొన్న ఐరోపా దేశాలు.. ఉష్ణోగ్రతల కట్టడికి ఐరాస చర్యలు



సాక్షి, అమరావతి: భూగోళం మండే అగ్నిగోళంగా మారుతోంది. శీతల దేశాల్లో సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడు. ఎండల ధాటికి ఓ వైపు అడవులు దగ్ధమైపోతుండగా.. మరోవైపు మంచు కరిగిపోయి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిపోయిందని.. ఇక గ్లోబల్ బాయిల్ యుగం వచ్చేసిందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇందుకు తగ్గట్లుగానే ఈ ఏడాది జూలైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని యూరోపియన్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించాయి. సాధారణంగా జూలైలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యేదని.. కానీ, ఈ ఏడాది దాదాపు 17 డిగ్రీలకు పెరిగిందని వెల్లడించాయి. 1.20 లక్షల సంవత్సరాల్లో భూమి ఇంత వేడిని ఎప్పుడూ చూడలేదని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ అర్ధగోళంలో విపరీత వేడి కారణంగా మంచు కరిగి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే చైనా, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా ఈశాన్య ప్రాంతాలు, జపాన్, భారత్, పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఎడారి ప్రాంతాల్లో పగటిపూటతో పోలిస్తే రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లబడుతుంది. కానీ, కాలిఫోర్నియాలోని 'డెత్ వ్యాలీ'లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. అక్కడ జూలై నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యా యని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే వాయవ్య చైనాలోనూ రికార్డు స్థాయిలో 52.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాడ్పులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికాలో కూడా పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. అలాగే ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోలాండ్ దేశాలను వడగాడ్పులు ఉక్కిరిబిక్కిరి చేశాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

పొంచి ఉన్న కరువు ముప్పు..!

దక్షిణ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, ఆసియా దేశాలు వసంత కాలం చివరి నుంచి అత్యధిక వేడిని ఎదుర్కొన్నాయని యూరోపియన్ కోపర్నికస్ నివేదిక చెబుతోంది. అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. గ్రీస్, ఇటలీ, క్రొయేషియా, అల్జీరియా, కెనడాలో కార్చిచ్చులు చెలరేగి అడవులను దహించాయి. నాడాలో ఏకంగా నాలుగు వారాల్లో 46 వేల చదరపు మైళ్ల అడవులు బూడిదయ్యాయి. 60 శాతం దేశాల్లోని అడవుల్లో మంటలు చెలరేగాయని నివేదిక తెలిపింది. వీటి ఫలితంగా 1950తో పోలిస్తే ప్రపంచ భూభాగంలో దాదాపు మూడో వంతు ఏటా కరువు సంభవిస్తుందని.. ఇది 10 లక్షల మందిని తీవ్ర ఆకలిలోకి నెడుతుందని శాస్త్రవేత్తల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఏడాది చివరితో పాటు 2024లో ఎల్‌నినో ప్రభావం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఫలితంగా బ్రిటన్, ఐర్లాండ్, బాల్టిక్ సముద్రం, జపాన్ సముద్రం, పసిఫిక్, పశ్చిమ హిందూ సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. కాగా, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ మేర కట్టడి చేసేందుకు ప్రపంచ దేశాలతో కలిసి ఐక్యరాజ్యసమితి చర్యలు చేపడుతోంది.

కోటికి చేరువలో 'జగనన్న సురక్ష'

నేటితో ముగియనున్న కార్యక్రమం

సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష'కార్యక్రమం ద్వారా నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.38 కోట్ల కుటుంబాలను ఇంటి వద్ద కలుసుకోవడం ద్వారా పెండింగ్ సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం ప్రతి ఇంటినీ జల్లెడ పట్టింది. జూన్ 23వ తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం నేటితో (జూలై 31వ తేదీ) ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా శనివారం నాటికే 15,002 సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల స్థాయిలో ప్రత్యేక వినతుల పరిష్కార క్యాంపులు పూర్తయ్యాయి. సోమవారం మిగిలిన 2 సచివాలయాల వద్ద క్యాంపులు కొనసాగుతాయని సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో విద్యార్థులకు అవసర మయ్యే ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఈ క్యాంపుల ద్వారా ఎలాంటి సరీ్వసు చార్జీలు లేకుండా ఉచితంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 59 లక్షల కుటుంబాలకు చెందిన దాదాపు కోటి మందికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూర్చారు. 99.80 లక్షల టోకెన్లు జారీ కాగా క్యాంపులు జరిగిన రోజు అధికారుల వద్దకు 95.96 లక్షల వినతులు ప్రస్తావనకు వచ్చాయి. ఇందులో 92.97 లక్షల వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి వివిధ దశల్లో పరిశీలన కొనసాగుతోంది.

29 ఏళ్లుగా వేధిస్తున్నారు..

- మాజీమంత్రి నారాయణపై రాయదుర్గం పీఎస్‌లో కృష్ణప్రియ పొంగూరు ఫిర్యాదు
- బావ నారాయణ, భర్త మణి అరాచకాలకు పాల్పడ్డారు
- పెళ్లి అయిన రెండో రోజు నుంచే నారాయణ సాధింపు
- లొంగకపోవడంతో వేధింపులు
- నారాయణపై మరోసారి ఆయన మరదలు తీవ్ర ఆరోపణలు



గచ్చిబౌలి (హైదరాబాద్): ఏపీ మాజీమంత్రి పొంగూరు నారాయణపై ఆయన తమ్ముడు సుబ్రహ్మణ్యం భార్య కృష్ణప్రియ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 29 ఏళ్లుగా నారాయణ, భర్త సుబ్రహ్మణ్యం అలియాస్ మణి తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నారని ఆదివారం ఉదయం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తాను ఎదుర్కొన్న అనుభవాలను పోస్టు చేశానని, రాజకీయంగా వారికి ఇబ్బంది కలుగుతోందని భావించి తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌ను మూసివేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గచ్చిబౌలిలోని బాంబూస్ మీనాక్షి విల్లాస్ ఎదుట కృష్ణప్రియ మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. పెళ్లైన రెండో రోజు నుంచే బావ నారాయణ లైంగిక వేధింపులు మొదలుపెట్టాడు. ఆయనకు లొంగకపోవడంతో 29 ఏళ్లుగా ఆయన పెట్టే బాధలు భరిస్తున్నాను. ఆయన స్త్రీలోలుడు. నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే కొందరు మహిళలు ఆయన దగ్గరకు వెళ్లాల్సిందే. సోదరి వరుసైన వారు స్నానం చేస్తున్నప్పుడు బాత్‌రూమ్‌లోకి తొంగి చూసేవాడు. ఈ విషయం మొదట్లో వాళ్ల వాళ్లే చెప్పారు. నేను లొంగకపోవడంతో వేధింపులు ప్రారంభించాడు. నాకు మానసిక సమస్య ఉన్నట్లుగా నా భర్త తప్పుడు సర్టిఫికెట్లు చూపించి యూట్యూబ్ వేదికగా ప్రచారం చేయడం చాలా బాధేసింది. నారాయణ మెడికల్ కాలేజీలో పనిచేసే డాక్టర్ శేషమ్మ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావడం వారికి పెద్ద సమస్య కాదు. అలాగే, నారాయణ పిల్లలకు మానసిక సమస్యలు ఉన్నాయి. డాక్టర్ విరించి వారికి చికిత్స చేస్తున్నారు. విరించి నుంచి కూడా సర్టిఫికెట్ తేవడం పెద్ద కష్టమేమి కాదు. ఒకరోజు మా నాన్నపై అరుస్తుంటే గుంటూరులో ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. నిద్రలేమితో నిద్రమాత్రలు వేసుకుంటున్నట్లు డాక్టర్‌కు చెప్పాను. మానసిక ఒత్తిడితోనే నిద్రలేమి సమస్య ఉండవచ్చని డాక్టర్ చెప్పారు. నేను ఇటీవల ఏఐజీ ఆస్పత్రిలో చేరిన విషయం నిజమే. ఇక రక్త సంబంధం ఉంది కాబట్టే నారాయణకు నా భర్త పెట్‌గా మారాడు.

కేసు నమోదు చేయలేదు : సీఐ

మరోవైపు.. కృష్ణప్రియ ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదని రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు.

మానసిక స్థితి బాగోలేదంటూ వీడియోలు

- కృష్ణప్రియపై వీడియో విడుదల చేసిన ఆమె భర్త సుబ్రహ్మణ్యం
- నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల మండిపాటు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ మాజీమంత్రి పొంగూరు నారాయణ చీకటి బాగోతాన్ని బయటపెట్టి సంచలనం సృష్టించిన అతని మరదలు కృష్ణప్రియ మానసిక పరిస్థితి బాగోలేదంటూ ఆమె భర్త సుబ్రహ్మణ్యం తాజాగా విడుదల చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. నారాయణ వికృత చేష్టలను సోషల్ మీడియా వేదికగా ప్రియ గత నాలుగు రోజులుగా వెలుగులోకి తెస్తున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ వర్గాలు కూడా నారాయణ చేష్టలను అసహ్యించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పరువుపోయిన నారాయణ కృష్ణప్రియపై ఓ పథకం ప్రకారం ఆమె మానసిక స్థితి బాగోలేదని ముద్రవేయించేలా చేశారు. ఇందులో భాగంగా.. కృష్ణప్రియ భర్త అయిన తన సోదరుడు సుబ్రమణ్యంతోనే ఆమె మానసికస్థితి బాగోలేదని, అందుకే అలా మాట్లాడుతోందని.. తన భార్య మాటలు ఎవరూ పట్టించుకోవద్దంటూ వీడియో రిలీజ్ చేయించి సోషల్ మీడియాలో విడుదల చేశారు. కానీ, నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే.. పెళ్లయిన నాటి నుంచి కృష్ణప్రియను మానసికంగా, శారీరకంగా వేధించడంవల్లే ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకుండాపోయిందని ఆమె కుటుంబసభ్యులు చెబుతున్నారు.

నారాయణపై చర్యలు తీసుకోవాలి..

మహిళలను వేధించే వారు ఏ స్థాయిలో ఉన్న వ్యక్తులైనా సరే వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. నారాయణ తన సోదరుడి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడం బాధాకరం. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పే గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న వ్యక్తి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. నారాయణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– పాల జ్యోతి,
మహిళా సంఘం నాయకురాలు, నెల్లూరు

జిల్లా వార్తలు

రైళ్ల రద్దు 6 వరకు పొడిగింపు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే పలు రైళ్లను ఈ నెల 30వ తేదీ వరకు రద్దు చేయగా, ఈ నిర్ణయం వచ్చే 6వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. విజయవాడ నుంచి కొత్తగూడెం వచ్చి వెళ్లే రైళ్లతో పాటు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వచ్చే రైలు, కొత్తగూడెం నుంచి బల్లార్షా వెళ్లే రైళ్లు 6వ తేదీ వరకు నడవవని స్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ తెలిపారు. అలాగే, విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్-విజయవాడ (07278), విజయవాడ-భద్రాచలం రోడ్(07279) రైళ్లను కూడా 6వ తేదీ వరకు రద్దు చేసినట్లు ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒక రోజు ఆదాయం రూ.34,795


కిన్నెరసానిని సందర్శిస్తున్న పర్యాటకులు


పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 975 మంది పర్యాటకులు రావడంతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.34,795 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే గోదావరి వరదల నేపథ్యంలో బోటింగ్ సిబ్బంది భద్రాచలంలో విధులు నిర్వర్తించాల్సి రావడంతో కిన్నెరసానిలో బోటింగ్ నిలిపివేశారు. దీంతో పర్యాటకులు కొంత నిరుత్సాహానికి లోనయ్యారు.

పిల్లలకు మిషన్ వాత్సల్యం !

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పథకం అమలు
- ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు
- భద్రాద్రి జిల్లాలో 325 మంది చిన్నారుల గుర్తింపు
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు



మిషన్ వాత్సల్య పథకం పోస్టర్



భద్రాచలంఅర్బన్: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా, నిస్సహాయ స్థితిలో ఉన్న బాలబాలికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఈ మేరకు 18 ఏళ్లలోపు బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, సంతోషకరమైన జీవితంతో పాటు ఆర్థిక భరోసా కల్పించేందుకు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా అర్హులకు నెలకు రూ.4 వేల చొప్పున అందించనున్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యాన ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తుండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటివరకు 325 మంది బాలబాలికలను అర్హులుగా గుర్తించారు. రోడ్డు ప్రమాదం, ఇతర కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, దంపతులు విడాకులు తీసుకోవడంతో నిరాదరణకు గురైన పిల్లలు), ఇతర అనాథలు, యాచకులు, తదితర వర్గాలకు చెందిన పిల్లలను గుర్తించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సర్వే నిర్వహిస్తున్నారు.

60, 40 శాతాలుగా వాటా

మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. విద్యార్థులకు అందించే రూ.4 వేలల్లో కేంద్రం వాటా రూ.2,400 (60 శాతం) కాగా, మిగిలిన రూ.1,600 (40శాతం) రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది. కాగా, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లల సంరక్షణతో పాటు వారి చదువు నిరాటంకంగా సాగేందుకు ఈ పథకం దోహదపడుతోంది.

దరఖాస్తు చేయడం ఇలా..

తల్లి లేదా తండ్రి చనిపోయి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రాలు, విడాకులు పొందితే కోర్టు జారీ చేసిన సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రులు, పిల్లల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, పాస్‌పోటోలను దరఖాస్తుకు జత చేయాలి. అలాగే, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, తల్లి, తండ్రి, సంరక్షకుడితో పాటు పిల్లలతో జాయింట్ అకౌంట్ లేదా పిల్లల పేరున తీసిన ఖాతా వివరాలు సమర్పించాలి. అర్హులు ఈ నెల 31వ తేదీ (సోమవారం) లోగా దరఖాస్తులను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం, పరిశీలన

గ్రామాల్లో తల్లిదండ్రులు లేని 18 ఏళ్లలోపు విద్యార్థినీ, విద్యార్థులను గ్రామకార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ద్వారా గుర్తించి దరఖాస్తు ఫారాలకు ధ్రువపత్రాలను జతపరిచి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి. ఆయా దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలించి అర్హుల వివరాలను కలెక్టరేట్‌కు పంపిస్తారు.

అర్హులు ఎవరంటే..

తల్లి వితంతు లేదా విడాకులు తీసుకుని ఉండాలి. తండ్రి కుటుంబాన్ని విడిచి పెట్టిన పిల్లలు, తల్లిదండ్రులను కోల్పోయి, ఇతర కుటుంబాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించారు. అలాగే, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, తల్లిదండ్రులు బాగా ఆర్థికంగా వెనుకబడి శారీరకంగా అసమర్థులై పిల్లలను పెంచలేని స్థితిలో ఉన్న వారి పిల్లలు, జువైనల్ జస్టిస్ చట్టం-2015 ప్రకారం గుర్తించిన బాలకార్మికులు, ఇంటి నుంచి పారిపోయిన బాల యాచకులు, పునరావాసం కోసం ఎదురు చూసే బాలికలేకాక గ్రామాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.96 వేల లోపు మించని వారి పిల్లలు కూడా అర్హులే.

త్వరలోనే అర్హులకు లబ్ధి..



జిల్లాలో మిషన్ వాత్సల్య పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాం. ఎక్కడా పొరపాటు జరగకుండా అన్ని విధాలా పరిశీలించాకే దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెల రూ.4 వేలు పిల్లల ఖాతాల్లోనే జమ చేస్తాయి. ఇప్పటివరకు జిల్లాలో 325 మందిని గుర్తించగా, త్వరలోనే ఎంపికయ్యే వారికి పథకం వర్తించనుంది.

–సబిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి,
భద్రాద్రి కొత్తగూడెం

అన్ని గ్రామాల్లో వివరాలు..



అనాథ పిల్లలను అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. పథకానికి అర్హులైన పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున అందుతాయి. అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధి గ్రామాల్లో అర్హులను గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నాం. ఎవరైనా అర్హులు ఉంటే అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియజేయవచ్చు.

–నవ్యశ్రీ, సీడీపీఓ,
దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు

ఆగస్టు 11న 'భారజల' ఎన్నికలు?

- పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ
- నేడు నామినేషన్ల ఉపసంహరణ
- ఎన్నికల్లో కొత్త నిబంధనపై హైకోర్టులో పిటిషన్
- ఆగస్టు 2న హైకోర్టులో విచారణ



మణుగూరు భారజల కర్మాగారం

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు ఆగస్టు 11న నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శనివారం రాత్రి పూర్తికాగా ఎన్నికల అధికారిగా మోహన్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో తొమ్మిది ఆఫీస్ బేరర్లు, 12 ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించనుండగా.. ఆఫీస్‌బేరర్లకు 34 మంది, ఎగ్జిక్యూటివ్ మెంబర్లకు 14 మంది నామినేషన్లు వేశారు. నేడు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఆర్‌టీయూ ఒక కూటమిగా, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ మరో కూటమిగా పోటీ చేయనున్నారు. జూలై 7న ఎన్నికలు జరగాల్సి ఉండగా కొత్త నిబంధనల అమలుతో వాయిదా పడ్డాయి. హైకోర్టులో పిటిషన్‌తో ఆగస్టు 11న ఎన్నికలు జరుగుతాయా.. లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త నిబంధనపై హైకోర్టులో పిటిషన్..

ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో కొత్త నిబంధనలు తీసుకొస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త నిబంధనలపై మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎస్‌ఎఫ్‌ఏఈఈ సంయుక్తంగా హైకోర్టులో పిటిషన్ వేశారు. డీఓపీటీ నిబంధనల ప్రకారం.. రెండేళ్ల పదవీ కాలం ఉన్న సంఘాలకు రెండుసార్లు ఎన్నికైతే మూడోసారి ఆ వ్యక్తి పోటీకి అవకాశం లేదు. ఐదేళ్ల పదవీ కాలం ఉన్న సంఘాలకు ఎన్నికైన వారు రెండోసారి పోటీకి అవకాశం లేదు.

డైలమాలో నాయకులు..

కొత్త నిబంధనపై ఈఏ, ఎస్‌ఎఫ్‌ఏఈఈ హైకోర్టుకు వెళ్లారు. పిటిషన్‌లో ప్రతివాదులుగా డీఓపీటీ, డీఏఈ, జీఎం, ఎన్నికల అధికారి పేర్లను చేర్చారు. పిటిషనర్లకు నామినేషన్ వేసే అవకాశం ఇవ్వాలని కోర్టు ఆదేశించి విచారణను ఆగస్టు 2కు వాయిదా వేశారు. కోర్టు ఆదేశంతో ముఖ్య నాయకులు నామినేషన్లు వేశారు. కోర్టు విచారణ ఆగస్టు 2న ఉండటంతో నేడు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరగనుండగా నాయకులు డైలమాలో ఉన్నారు. ఆగస్టు 2 కోర్టు విచారణ తర్వాత నామినేషన్ల ఉపసంహరణ నిర్వహించాలని పిటిషనర్లు ఎన్నికల అధికారిని కోరగా ఆయన నిరాకరించినట్టు సమాచారం. హైకోర్టు ఎన్నికలపై స్టే ఇస్తుందా, ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేస్తుందో అన్న ఉత్కంఠ నెలకొన్నది.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: మానవ అక్రమ రవాణాను కలిసికట్టుగా అరికట్టాలని బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతిరాణి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖమ్మం రైల్వే స్టేషన్ వీఐపీ లాంజ్‌లో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, దశాబ్ద కాలంగా పాలకులు అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నా.. అవగాహన రాహిత్యం వల్ల ఇటువంటివి జరుగుతున్నాయని తెలిపారు. ఆర్పీఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ నేర విభాగం లెక్కల ప్రకారం.. 2021లో ప్రతి గంటకు తొమ్మిది మంది పిల్లల చొప్పున మొత్తం 77,535 మంది తప్పియారని వెల్లడించారు. కాగా, గత ఏడాదితో పోలిస్తే 2021లో తప్పిపోయిన పిల్లల సంఖ్య 31 శాతం పెరిగిందని పేర్కొన్నారు. చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు అక్రమ రవాణా నిర్మూలనకు కఠినమైన చట్టాలు అవసరం అన్నారు. అనంతరం అక్రమ రవాణాపై రూపొందించిన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ప్రసాద్, జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్ రావు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బాధ్యుడు నరసింహారావు, ఫౌండేషన్ కౌన్సిలర్ రాజేష్, ఆపరేషన్ ముస్కాన్ టౌన్ టీం ఏఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ యాసిర్, కానిస్టేబుల్ సుభద్ర, రైల్వే డెస్క్ కోఆర్డినేటర్ మాధవి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ అనూష, కృష్ణంరాజు, ప్రశాంతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో స్పందించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: వరద బాధితుల పట్ల మానవీయ కోణంతో అధికార యంత్రాంగం స్పందించాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మంలోని ముంపు ప్రాంతమైన మోతీనగర్ బాధితులతో ఆదివారం ఆయన మాట్లాడారు. బాధితులను ఆదుకోవడం కోసం ఎన్డీఆర్‌ఎఫ్ నిధులను విడుదల చేసిందని, వెంటనే రాష్ట్ర యంత్రాంగం స్పందించి యుద్ధప్రాతిపదిక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాల్లో ఉప్పల శారద, చిలుకూరి రమేశ్, రుద్రప్రదీప్, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, లక్ష్మీనారాయణగుప్తా, అంకిత పాపారావు, దార్ల శంకర్, రమణ, జ్వాలా నర్సింహారావు, అనిత, రవీందర్ కుమార్ పాల్గొన్నారు.


దుప్పట్లు, నిత్యావసరాలు అందిస్తున్న సుధాకర్‌రెడ్డి, నాయకులు